# సత్యకామజాబాలి

డాక్టర్ కె.వి. రాఘవాచార్యులు

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

వేదకథాభారతి - 3

# సత్యకామ జాబాలి

రచన

డాక్టర్ కె. వి. రాఘవాచార్య

ప్రధాన సంపాదకుడు

ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య

ప్రచురణ

డాక్టర్ ఐ.వి.సుబ్బారావు, ఐ.ఏ.ఎస్.,

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

1999

VEDAKATHĀ BHĀRATI - 3

**SATYAKAMAJABALI**

by

***Dr. K. V. Raghavacharya***

Chief Editor

***Professor S. B. Raghunathacharya***

First edition 1999

Copies : 10,000

Published by

***Dr. I.V. Subba Rao,*** *I.A.S.,*
Executive officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

Price .

Printed at
**ANNAPURNA GRAPHICS**
53, (Upstairs) R S Gardens
Tirupati ✆ : 30184

# మామాట

**డాక్టర్ ఐ.వి. సుబ్బారావు,** ఐ ఏ ఎస్,
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

నిత్య సత్యమైన ప్రమాణాలు వేదాలు మానవజాతి మనుగడకు అడుగడుగునా మార్గదర్శనం చేస్తూ నిస్స్వార్థ బుద్ధితో, త్యాగమయమైన ప్రవృత్తితో తమ తమ జీవితాలను పండించుకున్న ఎందఱో మహానుభావుల జీవన వైభవాలు మనకు వేద వాఙ్మయంలో దర్శనమిస్తున్నాయి

''ఆహా! ఎటువంటి కర్తవ్యదీక్ష! ఎంత విశాలదృష్టి! ఎటువంటి విశ్వకల్యాణభావన! ఎంతటి ధార్మికచేతన!'' అని మనల్ని ఆశ్చర్యపరిచే జీవనవేదం మనకీ వాఙ్మయంలో ప్రత్యక్షమౌతుంది ఆ వేదనాదాన్ని ఇంటింటా వినిపించాలనే మా ఆకాంక్షకు ప్రతిరూపమే -

**ఈ వేద కథా భారతి.**


వేదకథాభారతిలోని ఎనలేని మానవత్వపు విలువలు ఈ తరాన్ని ప్రభావితం చేయగలిగితే అంతకంటే మాకు ఆనందమేముంటుంది ?

ఈ కథాపుష్పాలను సంపాదించి తీర్చి దిద్ది అందమైన మాలగా రూపొందించిన ప్రొఫెసర్ ఎస్ బి రఘునాథాచార్య గారిని మనసార అభినందిస్తున్నాను

ఇంత చక్కగా ముద్రించిన అన్నపూర్ణ గ్రాఫిక్స్ వారికి అభినందనలు

జయతు జయతు భారతీ
వేద కథా భారతీ

❀ ❀ ❀



# మనవి

వేద కథాభారతి

అంతశ్శత్రువులను అణచివేసి కొన్ని ఆదర్శాలకు, విలువలకు పట్టంకట్టి, ధార్మిక జీవనానికి ప్రాణంపోస్తూ ఈ లోకంలోనే కాక ఇతరలోకాల వారికి కూడా నిండైన మానవత్వమంటే 'ఇది' అని ఆచరణ పూర్వకంగా నిరూపిస్తూ, అందులోని మధురిమలను చవిచూపిస్తూ వేదనాదవిభాసురమైన ఒక జీవన స్రవంతి ఈ గడ్డపై వెల్లివిరిసింది.

జలజలసాగే ఆ అమృత వాహిని వసుంధరను రసమయం చేసింది సస్యశ్యామలం చేసింది సుగంధపరిమళాలను వెదజల్లే నందనోద్యాలను వెలయించింది. మానవ సృష్టిలో అరుదైన ప్రమాణాలను కొన్నింటిని నిలబెట్టింది. వాటికి కాలదోషం లేదు. ఆనాటికి, ఈ నాటికి, ఏనాటికైనా మానవతకు గమ్యాన్ని, జీవనానికి అర్థాన్ని పరమార్థాన్ని సాధించడంలో ఆ ప్రమాణాలు చరితార్థాలయినాయి అలాంటి జీవన చిత్రాలకు పట్టిన అద్దమే ఈ వేదకథాభారతి

ఒక్కసారి పరిశీలించండి ! ఆ చిత్రరామణీయకతను మంచిమనసుతో దర్శించండి ! వారి ఆత్మల ఔన్నత్యాన్ని వారి భావనల ఔచిత్యాన్ని మీరు తప్పక అభినందిస్తారు ! అవి మంచివని తోస్తే అనుసరించచడానికి ప్రయత్నించండి ! ఆనందించండి !

ప్రమాధి - నిజజ్యేష్ఠ
బహుళ - సప్తమి
5-7-1999

ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య



# సత్యకామ జాబాలి

పూర్వకాలంలో సప్తసింధు ప్రాంతంలో శతద్రు నదీ (నేటి సట్లెజ్) తీరాన గౌతమ గోత్రజుడైన హారిద్రుమంత మహర్షి ఒక గురుకులమును స్థాపించి విద్యార్థులకు విద్యాదానం చేస్తుండేవాడు ఆనాటి బ్రహ్మవిద్యోపదేశకులలో గౌతమ మహర్షి ప్రథమగణ్యుడుగా కీర్తి ప్రతిష్ఠలను సంపాదించాడు. హారిద్రుమంత మహర్షి యొక్క తపశ్శీలములను, విద్వత్తును గుర్తించి అనేక మంది తమ కుమారులను వేదాధ్యయనం కోసం గౌతమ మహర్షి గురుకులానికి పంపించేవారు గౌతమ మహర్షి విద్యార్థులకు విద్యాబోధనతోపాటు, ఉచిత భోజన, వస్త్ర, వసతులను కూడా కల్పించినాడు గురుకులనిర్వహణకు కావలసిన వస్తుసామగ్రిని ధనవంతులు సమకూర్చేవారు. మహర్షి వద్ద అపారమైన గోసంపద ఉండేది గురుకులంలోని విద్యార్థులు గోసంరక్షణ చేస్తుండేవారు గౌతమ మహర్షి గురుకులంలోని విద్యార్థులకు ఏ కొరత లేకుండా అధ్యాపనయజ్ఞాన్ని నిర్వహిస్తుండేవాడు

### విద్యార్థులకు లోటు లేదు :

మహర్షి గురుకులంలో అనేక మంది విద్యార్థులు ఉండేవారు అందుకు కారణం అధ్యాపకుల అధ్యాపనతత్పరత, శీలసంపద

విద్యార్థులను దయార్ద్ర హృదయంతో కన్నబిడ్డలవలె చూస్తుండేవాడు అందుచేత విద్యార్థులు తల్లిదండ్రులను, స్వగృహాన్ని మరచి గురుకులంలో హాయిగా కాలం గడపుతుండేవారు ద్వాదశవత్సర వేదాధ్యయన బ్రహ్మచర్యదీక్ష సంపూర్ణమయిన తర్వాత సమావర్తనోత్సవం జరుపుకొని, గృహస్థాశ్రమస్వీకారానికి గురువర్యుని అనుజ్ఞపొంది విద్యార్థులు వెళ్ళుతున్నా మరలా క్రొత్త విద్యార్థులు వచ్చి చేరుతుండేవారు. ఈ విధంగా గౌతమ మహర్షి గురుకులం ఎల్లప్పుడు విద్యార్థులతో కలకలలాడుతూ ఉండేది

**నిన్ను శిష్యునిగా స్వీకరిస్తున్నాను :**

ఒకనాడు విద్యార్థులందరు స్నానసంధ్యాదులు ముగించుకొని, అగ్నికార్యములు పూర్తి చేసుకొని కులపతియగు హారిద్రుమత గౌతమ మహర్షి సన్నిధిలో అధ్యయనానికి ఉపక్రమించారు ఇంతలో ఎనిమిది సంవత్సరాల బాలుడొకడు ఆశ్రమంలో ప్రవేశించి, మహర్షికి సాష్టాంగ ప్రణామం చేసి-

*''గురుదేవా! నేను తమ గురుకులంలో వేదాధ్యయనం చేయాలనే ఆసక్తితో వచ్చాను. దయతో నన్ను శిష్యునిగా స్వీకరించండి. విద్యాదానం చేయండి''*

అని వినయవిధేయతలతో ప్రార్థించాడు

ఈ నూతన విద్యార్థికి ఉపనయన మయినట్లు వీపున జందెము లేదు సంప్రదాయం తెలియనందున సమిధలు చేతబట్టుకుని రాలేదు. వేదాధ్యయనం చేయదలచిన విద్యార్థి తండ్రిచే ఉపనయనసంస్కారం పొంది యుండాలి గురువు దగ్గరకు వచ్చేటప్పుడు సమిధలు చేతబట్టుకుని రావాలి ఇది ఆనాటి గురుకులసంప్రదాయం సంప్రదాయం తెలియకుండా గురుకులానికి వచ్చిన ఆబాలుని విద్యార్థులందరు ఆశ్చర్యంగా చూచారు గౌతమమహర్షి మాత్రం ఆబాలుని అమాయికతకు, చొరవకు, తెలివితేటలకు, వినయ విధేయతలకు ముగ్ధుడయినాడు బాలుడు గుణవంతుడు, బుద్ధిమంతుడు అనుకున్నాడు

గౌతమ మహర్షి ఒకసారి తన ముందున్న విద్యార్థుల వైపు చూచి, వారి ఆశ్చర్యాన్ని చూపులతోనే నివారించి, బాలుని వైపు తిరిగి మృదువుగా, మధుర స్వరంతో '' ఓ ప్రియదర్శనుడా! నిన్ను శిష్యునిగా స్వీకరిస్తున్నాను నీ వంశమేది? నీవు ఏ గోత్రానికి చెందినవాడవు? అని ప్రశ్నించాడు. ఆ కాలంలో శిష్యుని వంశము, గోత్రము తెలిసికొనకుండ గురువులు ఉపదేశం చేసేవారు కారు గౌతమ మహర్షి మాటలకు సంతోషించి, ఆ బాలుడు- ''గురుదేవా! నేను నాతండ్రిని ఎరుగను నా వంశమేదో తెలియదు నాకు మాగోత్రమేదో తెలియదు కూడ మా అమ్మ ఉంది మీరు అనుమతి ఇస్తే, మా అమ్మ వద్దకు వెళ్ళి, నావంశమేదో,

మా గోత్రమేదో తెలిసికొని వస్తాను మీ ఆశ్రమంలో చేరి, శిష్యునిగా మిమ్ము సేవిస్తాను'' అని వినయంగా చెప్పుకున్నాడు

**అనాథబాలల్ని అవమానించకూడదు !**

ఆ బాలుని మాటలను విని, విద్యార్థులలో కొందరు ''తన తండ్రిని, గోత్రమును తెలియని వాడు, ఉపనయనం కాకుండా, వేదాధ్యయనం కోసం వచ్చాడు ఎంత విచిత్రం!'' అనుకున్నారు ''వీడు బ్రాహ్మణుడు కాడేమో? ఆ తేజస్సూ, ఆ ధైర్యం చూస్తే ఆశ్చర్యం వేస్తోంది'' అని మరి కొందరు అనుకున్నారు

అంతవరకు గంభీరంగా ఉన్న గౌతమ మహర్షి విద్యార్థుల ఆలోచనలను పసికట్టి, ''వత్సలారా! తండ్రి లేనివానికి గురువే తండ్రి! ఈ బాలునికి నేను తండ్రిని ఈ బాలునికి ఉపనయన సంస్కారం నేను జరిపిస్తాను. అనాథబాలురను అవమానించరాదు వారిని దయతో చూడాలి''- అని బోధించి, సౌమ్యుడా! ఉపనయన సంస్కార సమయంలో నీవు తండ్రి పేరు, గోత్రనామం చెప్పుకోవాలి మీ ఇంటికి వెళ్ళి, మీ తల్లిని అడిగి, మీ తండ్రి ఎవరో? గోత్రమేమిటో? తెలిసికొనిరా! ఇంటికి వెళ్ళు అని అనుమతించాడు ఆ బాలుడు మహర్షికి నమస్కరించి, సంతోషంతో, హుటాహుటిని, తన తల్లి వద్దకు వచ్చి, ఇలా అడిగాడు-

*''అమ్మా! నా తండ్రి పేరేమిటి? గోత్రమేమిటి? నేను*

గౌతమ మహర్షిని ఆశ్రయించి, వేదాధ్యయనం కోసం బ్రహ్మచర్య దీక్షను స్వీకరించాలను కుంటున్నాను. కాబట్టి నా తండ్రి ఎవరు? నా గోత్రమేమిటో చెప్పు.''

ఆమె సంధిగ్ధంలో పడింది - అయినా వెంటనే తేరుకుని ఇలా సమాధానం చెప్పింది-

**సత్యకామ జాబాలినని చెప్పు!**

''నాయనా! నీ తండ్రి ఎవరో? వారి పేరేమిటో తెలియదు. నీవు ఏగోత్రానికి చెందినవాడవో నాకు తెలియదు. నా యౌవనంలో దాసీగా పనిచేస్తూ, అనేకచోట్ల తిరిగాను అనేకమందిని సేవించాను నిన్ను కన్నాను. కాని నీ తండ్రి ఎవరో? మన గోత్రమేమిటో నాకు తెలియదు. నా పేరు జబాల నీ పేరు సత్యకామ. కాబట్టి గురువుగారికి 'నేను' సత్యకామ జాబాలిని అని చెప్పు ''

సత్యకాముడు తల్లి వద్దనుండి గురువు వద్దకు ప్రయాణ మయినాడు గౌతమ మహర్షి గురుకులంలో బ్రహ్మచారులందరు నిత్యకృత్యాలను పూర్తి చేసికొని, అధ్యయనానికి సిద్ధమవుతున్నారు హారిద్రుమత మహర్షి గురుపీఠంపై ఆసీనుడయినాడు సత్యకాముడు గౌతమ మహర్షిని సమీపించి, సాష్టాంగ నమస్కారం చేసి, వినయంగా నిలుచున్నాడు. గౌతమ మహర్షి ప్రసన్నవదనంతో సత్యకాముని చూచి,

''వత్సా! నీ తండ్రి ఎవరో? మీ గోత్రమేమిటో? తెలిసికొని వచ్చావా?''
అని ప్రశ్నించాడు

సత్యకాముడు వినయంతో గురువర్యా! మీ ఆజ్ఞననుసరించి, మా తల్లిని ఆ వివరాలు అడిగినాను దానికి మా అమ్మ ఇలా చెప్పింది-

''నాయనా! నీ తండ్రి ఎవరో నాకు తెలియదు మన గోత్రమేమిటో కూడా నాకు తెలియదు నా యౌవనంలో దాసీగా పని చేస్తూ, అనేక చోట్ల తిరిగాను అనేకమందిని సేవించాను నిన్ను కన్నాను కాని నీ తండ్రి ఎవరో? మన గోత్రం ఏమిటో నాకు తెలియదు నా పేరు జబాల నీపేరు సత్యకామ. కనుక గురువుగారికి 'నేను సత్యకామ జాబాలిని' అని చెప్పు ''

**ఆహా! ఎంతటి సత్యనిష్ఠ!**

ఈ మాటలు చెప్పి సత్యకాముడు నిర్భయంగా నిల్చున్నాడు విద్యార్థులందరు ఈ కుల గోత్రాలు లేని బాలుని గురువు గారు శిష్యునిగా స్వీకరిస్తారా? లేదా? అని ఎదురుజూస్తున్నారు గౌతమ మహర్షి గంభీర వదనంతో''శిష్యులారా! చూచారా! సత్యనిష్ఠుడైన ఈ బాలుని ప్రవర్తన! సత్యవాక్య పరిపాలన చేసే బ్రాహ్మణుడు కాక మరెవరు ఇలా ఉన్నదున్నట్లు, నిష్కపటంగా, సరళంగా, స్పష్టంగా చెప్పగలరు? సత్యపథంనుండి తొలగిపోని వారందరు బ్రహ్మోపదేశానికి అర్హులే! ఈ సత్యనిష్ఠచేత ఈ బాలుడు బ్రాహ్మణకుమారుడు సత్యకాముడు శిష్యునిగా ఈ

గురుకులంలో చేరడానికి అర్హుడు'' అని చెప్పి, సత్యకాముని వైపు చూచి ''సౌమ్యుడా! నీవు సార్థకనామధేయుడవు నీ సత్యనిష్ఠకు సంతోషించాను నిన్ను శిష్యునిగా స్వీకరిస్తున్నాను నీకు ఉపనయన సంస్కారం చేస్తాను సమిధలు సంపాదించి తీసికొని రా!'' అని ఆజ్ఞాపించాడు మహర్షి తన శిష్యులను సత్యకాముని ఉపనయనానికి తగిన ఏర్పాట్లు చేయమని ఆజ్ఞాపించాడు

**గురుకులవాసం :**

గౌతమ మహర్షి ఉదార, దయార్ద్ర హృదయానికి శిష్యులు నమస్కరించారు. గురుదేవుని ఆజ్ఞను పరిపాలించారు సత్యకాముడు సమిధలు తీసికొని వచ్చాడు ఒక శుభముహూర్తాన హారిద్రుమత గౌతమ మహర్షి సత్యకామునికి తండ్రివలె ఉపనయన సంస్కారం చేసి, గాయత్రిని ఉపదేశించాడు గౌతముని ధర్మపత్ని మాతృదేవిగా నూతన వటువుకు భిక్షాన్నప్రదానం చేసింది. జబాల పుత్రుడైన సత్యకాముడు గౌతమమహర్షి ఆశ్రమంలో నిత్యాగ్ని హోత్ర, గాయత్రీ ఉపాసనలతో, బ్రహ్మచర్యదీక్షతో వేదాధ్యయనం చేస్తూ గురుకులవాసియైనాడు

**గురుహృదయాన్ని సంతృప్తి పరచాలి :**

కొన్ని సంవత్సరాలు గడిచాయి. గౌతమ మహర్షి సత్యకాముని గోసేవా కార్యక్రమం ద్వారా బ్రహ్మజ్ఞానిగా చేయదలంచాడు ఒకనాడు

శిష్యుని పిలిచి, ''నాయనా! సత్యకామా! నేటి నుండి నీకు గోసేవా కార్యక్రమాన్ని అప్పగిస్తున్నాను దానిని శ్రద్ధగా చేస్తే నీ మనోరథం నెరవేరుతుంది'' అని చెప్పాడు సత్యకాముడు వినయంతో నమస్కరించి ''గురుదేవా! మీరు అప్పగించిన పని ఏదైనా దాన్ని సంతోషంతో, శ్రద్ధతో నెరవేరుస్తాను'' అన్నాడు గురువు చెప్పిన పని ఎంత కష్టమైనా, చేసి, గురుహృదయాన్ని సంతృప్తి పరచడం గురుసేవలో ఒక మార్గం!

హారిద్రుమత గౌతమ మహర్షి తన గోసమూహము నుండి నాలుగు వందల వట్టిపోయిన, చిక్కిపోయిన ఆవులను, ఆబోతులను సత్యకామునికి అప్పగించి, ''వీటిని నీవు మంచి మేత, నీరు గల ప్రదేశానికి తీసుకువెళ్ళి శ్రద్ధగా మేపి, వాటిని శక్తి మంతములు చేసి తీసుకురావాలి'' అని ఆజ్ఞాపించాడు

సత్యకాముడు గుర్వాజ్ఞను శిరసావహించి, గౌతమ మహర్షి పాద పద్మములకు నమస్కరించి, వారి ఆశీర్వాదములను పొందాడు గోపాలుని వలె సత్యకాముడు ఒక చేతిలో కర్ర, ఒక చేతిలో కమండలువు పట్టుకొని వీపున గురుపత్ని యిచ్చిన ఆహారమును మూట గట్టుకొని గోగణంతో ఆశ్రమం నుండి అనిర్దిష్ట ప్రదేశానికి ప్రయాణమైనాడు సత్యకాముడు నాలుగు వందల గోవులను తోలుకొని పోతూ '' ఈ ఆవుల సంఖ్య వేయి అయ్యే వరకు నేను తిరిగి రాను'' అని ప్రతిజ్ఞ చేశాడు తోటి బ్రహ్మచారులు గురుదేవుల విచిత్రాదేశానికి ఆశ్చర్య చకితులైనారు కొందరు

సత్యకామునిపై జాలితో ''పాపం! ఈ నాలుగు వందల ఆవులను అరణ్యంలో ఒక్కడే సంరక్షించగలడా!'' అని సందేహం వెలిబుచ్చారు గుర్వాజ్ఞపై శ్రద్ధ గలవానికి, గుర్వనుగ్రహం గలవానికి కార్యాచరణలో ఎట్టి ఆటంకములు, ఆపదలు రావు గదా!

**గోసేవావ్రతం :**

సత్యకాముడు తన గమ్యస్థానం ఏదో తెలియక అడవులు, గుట్టలు దాటుకుంటూ ప్రయాణం చేస్తున్నాడు సూర్యాస్తమయ సమయానికి ఒక జలాశయం దగ్గర ఆగడం, సాయం సంధ్యా, అగ్ని కార్యక్రమాలు నెరవేర్చడం, గోవులకు నీళ్ళు పెట్టడం, మేత వేసి, సేవ చేయడం, అక్కడే రాత్రి నిద్రించడం, ఉదయంవే లేచి, ప్రాతస్సంధ్యానుష్ఠానములు పూర్తి చేసుకుని గోగణంతో ప్రయాణం చేయడం - ఇదీ అతని దిన చర్య. కొన్ని దినముల ప్రయాణం తర్వాత ఒకచోట చక్కని విశాలమైన జలాశయం, పచ్చిక బయలు, ఫలపుష్ప భరితమైన వృక్షాలు గల విశాలమైన మైదానం చేరాడు అది తన స్థిర నివాసానికి తగిన ప్రదేశమని తలంచి, అక్కడ ఒక చిన్న పర్ణశాలను నిర్మించుకున్నాడు. గుర్వాజ్ఞను తలంచుకొని, నిత్య కర్మలను నెరవేరుస్తూ గోసేవావ్రతాన్ని చేస్తున్నాడు.

ప్రకృతి సౌందర్యం విలసిల్లే వనప్రదేశంలో సత్యకాముడు ఆవులను మేపుతూ, వాటిని కాపాడుతూ అయిదు సంవత్సరాలు

గడిపాడు అతని ప్రేమమయ సేవాశుశ్రూషలకు గోవులు సంతోషించాయి సమృద్ధిగా లభిస్తున్న తృణమును తుష్టిగా మేసి, మంచి నీటిని త్రాగి గోవులు శక్తిమంతములై, సంతానవంతములైనాయి గోగణం సంఖ్య వేయికి పైగా పెరిగింది ఆ గోగణంలోని వృషభములు పెద్దమూపురములతో ఏనుగులవలె బలిసి, శివుని వాహనమైన నందికి ప్రత్యర్థులుగా ఉన్నాయి

సత్యకాముడు శ్రద్ధాభక్తులతో గోసేవావ్రతాన్ని చేస్తున్నా అతని హృదయం మాత్రం సత్యసాక్షాత్కారం కోసం అన్వేషిస్తూనే ఉంది ఆసుందర వన ప్రదేశంలో ప్రతి ప్రకృతి రామణీయకత అతనికి భగవత్తత్వాన్ని ఉపదేశిస్తోంది అనురాగరంజితాలైనగోవృషభములు, చెట్ల ఆకుల గుసగుసలు, ప్రకృతి సౌందర్యాన్ని చూచి మైమరచి పాటలు పాడే పక్షులు, పరవళ్ళు తొక్కుతున్న సెలయేళ్ళు, వెలుగును వెదజల్లుతూ దూరదూరం నుంచే పలకరించే నక్షత్రాలు, భగవత్స్వరూపులైన సూర్య చంద్రులు సత్యకామునికి ప్రకృతి సత్యాన్ని, ఈశ్వరతత్త్వాన్ని వివరించ సాగాయి

**వాయుదేవుని ఉపదేశం :**

ఒకనాడు సత్యకాముడు ప్రాతః సంధ్యానుష్ఠానములు తీర్చుకొనుచుండగా, గురువు యొక్క ఆదేశాన్ని అనుసరించి అతడు శ్రద్ధాభక్తులతో చేస్తున్న గోసేవా వ్రతమునకు సంతుష్టినొందిన వాయుదేవుడు గోగణంలో వున్న ఒక వృషభమును ఆవహించి-

''ఓ సత్యకాముడా!'' అని పిలిచాడు

సత్యకాముడు - 'దేవా! ఏమిటి ఆజ్ఞ!'' అని వినయంగా నమస్కరించాడు

వృషభము - ' ఓ ప్రియదర్శనుడా! సత్యకాముడా! మేము (గోసంతతి) వేయికి పైగా పెరిగినాము అందుచేత మమ్మల్ని గౌతమ మహర్షి ఆశ్రమమునకు చేర్చు నీ ప్రతిజ్ఞ నెరవేరింది నీకు పరబ్రహ్మ యొక్క ఒక పాదాన్ని గురించి ఉపదేశిస్తాను'' అంది

సత్యకాముడు - ''చిత్తం! నాకు బ్రహ్మస్వరూపాన్ని ఉపదేశించండి '' అన్నాడు

వృషభము (వాయుదేవుడు) - ''పరబ్రహ్మ స్వరూపము పదహారు కళలతో (భాగాలతో) నాలుగు పాదములతో కూడి ఉంది. అందులో దిక్సంబంధమైన మొదటి పాదమును గురించి ఉపదేశిస్తున్నాను పూర్వ దిక్కు, పశ్చిమ దిక్కు, దక్షిణ దిక్కు, ఉత్తరదిక్కు అని నాలుగు భాగాలున్నాయి వీటి సమిష్టి స్వరూపము బ్రహ్మకు ఒక పాదం దీనికి 'ప్రకాశవాన్' (బాహ్యంగా వ్యక్తమయ్యేది) అని పేరు నాలుగు భాగాలతో (కళలతో) కూడిన ఈ 'ప్రకాశవాన్' అనే బ్రహ్మ యొక్క ఒక పాదాన్ని ఉపాసించినవాడు లోకంలో ప్రసిద్ధిని పొంది, చనిపోయినపుడు తేజోవంతమైన ఉత్తమ లోకాలకు పోతాడు నీకు రెండవ పాదాన్ని అగ్ని దేవుడు ఉపదేశిస్తాడు.'' అని చెప్పి, ఆ వృషభం మౌనం వహించింది

వాయుదేవుడు చెప్పిన బ్రహ్మ స్వరూపాంశమును గ్రహించిన తర్వాత సత్యకాముని హృదయంలో అలౌకిక ఆనందం వెల్లి విరిసింది ముఖం తేజస్వంతమయింది।

**అగ్నిదేవుని ఉపదేశం :**

మరునాడు ప్రాతఃకాలాన నిత్యానుష్ఠానములను తీర్చుకుని, వృషభదేవత ఆజ్ఞానుసారం సత్యకాముడు గోగణాన్ని గౌతమ మహర్షి ఆశ్రమం వైపు మరలించి, ప్రయాణం చేయసాగాడు, ముందు గోగణం నడుస్తుండగా, వాటిని రక్షిస్తూ గోధూళి ధూసరిత శరీరుడై సత్యకాముడు వాటి వెనుక నడుస్తున్నాడు సాయంకాలమైంది ఒక జలాశయం దగ్గర గోవులనన్నిటిని నిలిపి వాటికి నీళ్ళు త్రాపి, శుశ్రూష చేశాడు తాను స్నానసంధ్యాదులు ముగించుకొని, అగ్ని కార్యమునకై సమిధలు పేర్చి, అగ్న్యాధానం చేసి, వృషభం చెప్పిన మాటలనే ధ్యానిస్తూ అగ్ని హోత్రానికి పడమటి వైపున తూర్పు వైపు ముఖం పెట్టి కూర్చున్నాడు అప్పుడు అగ్నిదేవుడు ప్రత్యక్షమై ' ఓ సత్యకామా।' అని పిలిచాడు

సత్యకాముడు - ''చిత్తం। దేవా! ఏమిటి ఆజ్ఞ! అని నమస్కరించాడు.

అగ్ని దేవుడు- ''ఓ ప్రియదర్శనుడా! సత్యకాముడా! నేను బ్రహ్మయొక్క రెండవ పాదాన్ని గురించి ఉపదేశిస్తాను''.

సత్యకాముడు - ''చిత్తం! అను గ్రహించండి।''

అగ్ని దేవుడు - ''పృథివి ఒక భాగం, అంతరిక్షం ఒక భాగం, ద్యులోకం ఒక భాగం, సముద్రం ఒక భాగం. వీటి సమిష్టి స్వరూపం బ్రహ్మ యొక్క రెండవ పాదం. దీనికి 'అనంతవాన్' (అనంతమైనది) అని పేరు. ఈ అనంతత్వగుణం కల్గిన బ్రహ్మ యొక్క రెండవ పాదాన్ని తెలిసికొని ఉపాసించిన వాడు అనంతగుణ సంపన్నుడవుతాడు మృతుడైన వెనుక అక్షయ లోకములకు పోతాడు నీకు మూడవ పాదాన్ని గురించి సూర్యుడు హంస రూపంలో వచ్చి ఉపదేశిస్తాడు'' అని చెప్పి అగ్ని దేవుడు సామాన్య జ్వాలారూపాన్ని పొందాడు సత్యకాముడు అగ్నిదేవుని ఉపదేశంతో బ్రహ్మతత్త్వస్వరూపానుభూతిని పొంది ఆనందమగ్నుడైనాడు

**ఆదిత్యుని ఉపదేశం :**

సత్యకాముడు మరునాడు యథాప్రకారం అనుష్ఠానములు పూర్తి చేసి, గోగణాన్ని తోలుకుంటూ, గౌతమ మహర్షి ఆశ్రమం వైపు ప్రయాణం కొనసాగించాడు. సాయంకాలమైంది. గోగణాన్ని ఒక చోట నిలిపి, అగ్ని హోత్రం చేసి, అగ్నికి పడమటి దిక్కున, తూర్పువైపు ముఖం పెట్టి కూర్చుని, అగ్నిదేవుడు చెప్పిన విషయాన్ని ధ్యానిస్తున్నాడు. సత్యకాముని హృదయంలో వాయు, అగ్ని దేవులు చేసిన ఉపదేశాలు ప్రతిధ్వనిస్తున్నాయి. ఇంతలో ఆదిత్యదేవత హంస రూపంలో ప్రత్యక్షమై ' ఓ సత్యకాముడా!' అని పిలిచింది.

సత్యకాముడు- 'భగవాన్! ఏమిటాజ్ఞ!'' అని నమస్కరించాడు

హంస- '' ఓ సౌమ్యుడా! సత్యకామా! నీకు బ్రహ్మస్వరూపం యొక్క మూడవ పాదాన్ని గురించి ఉపదేశిస్తాను''

సత్యకాముడు - ''చిత్తం! ఉపదేశించండి!''

హంస- ''బ్రహ్మ యొక్క మూడవ పాదం ప్రకాశమానములై, జ్యోతి రూపంలో నున్న అగ్ని కళ, సూర్యకళ, చంద్రకళ, విద్యుత్ కళ అని నాలుగు భాగాలు కల్గి ఉంది దీనికి ''జ్యోతిష్మాన్'' అని పేరు ఈ విషయం తెలిసిన విద్వాంసుడు 'జ్యోతిష్మాన్' రూపంలో బ్రహ్మను ఉపాసిస్తే, ఈ లోకంలో తేజోవంతుడై మరణించిన పిదప తేజోవంతమైన లోకాలకు పోతాడు నీకు బ్రహ్మ యొక్క నాల్గవ పాదాన్ని గురించి ప్రాణదేవతా రూపమైన 'మద్గు' అనే నీటి పక్షి బోధిస్తుంది'' అని చెప్పి హంస ఎగిరి పోయింది

**ప్రాణదేవత ఉపదేశం :**

మరునాడు సత్యకాముడు ఆవులమందను గౌతమ మహర్షి ఆశ్రమం వైపు తోలుకొని పోతుండగా సాయంకాలమైంది అప్పుడు సత్యకాముడు గోవులనన్నిటిని ఒకచోట నిలిపి, వాటిని సేద దేర్చి, అక్కడే అగ్నిని ప్రతిష్ఠించి, హోమంచేసి అగ్నిహోత్రునికి పశ్చిమ దిశయందు తాను పూర్వాభిముఖుడై హంసోపదేశాన్ని మననం చేస్తూ కూర్చున్నాడు అప్పుడు ప్రాణదేవత 'మద్గు' అనే నీటిపక్షి రూపంలో ప్రత్యక్షమై 'ఓ

సత్యకాముడా!'' అని పిలిచింది

సత్యకాముడు - 'దేవా! ఆజ్ఞ' అని నమస్కరించాడు

మద్గు - '' ఓ ప్రియదర్శనుడా! సత్యకాముడా! నీకు బ్రహ్మ యొక్క నాల్గవ పాదాన్ని గురించి ఉపదేశిస్తాను''.

సత్యకాముడు - ''దేవా ! అనుగ్రహించండి''

మద్గు - ''బ్రహ్మ యొక్క చతుర్ధపాదం సర్వానుభవ సిద్ధమై యున్న ప్రాణకళ, చక్షుఃకళ, శ్రోత్రకళ, మనఃకళ అనే నాలుగు భాగాలు కలది. ఈ పాదాన్ని ''ఆయతనవాన్'' ( ఆశ్రయం కలది) అని పిలుస్తారు ఇది తెలిసికొని, బ్రహ్మ యొక్క చతుర్థపాదాన్ని ఉపాసించిన వాడు ఈ లోకంలో మంచి ఆశ్రయాన్ని పొంది, చనిపోయిన తర్వాత సర్వాశ్రయములుగా నుండెడు ఉత్తమ లోకాలకు పోతాడు సత్యకామా! నీకు బ్రహ్మతత్త్వోపదేశం పూర్తి అయింది నీవు ఈ షోడశ కళా పరిపూర్ణమయిన బ్రహ్మమును ఉపాసించు బ్రహ్మజ్ఞానివి కాగలవు నీకు శుభమగుగాక!'' అని ఆశీర్వదించి మద్గు ఎగిరిపోయింది

ఎవరు బ్రహ్మోపదేశం చేశారు?

సత్యకాముడు వాయు, అగ్ని, సూర్య, ప్రాణ దేవతలవలన తాను పొందిన ఉపదేశాన్ని మననం చేస్తూ రాత్రి గడిపాడు. మరునాడు

గోగణమును తోలుకొని ఆచార్యగృహమునకు బయలు దేరాడు సూర్యాస్తమయ సమయానికి ముందుగా, బ్రహ్మవేత్త యైన సత్యకామ జాబాలి, మహర్షి గౌతముని గురుకులంలో గోగణంతో ప్రవేశించాడు సహస్ర సంఖ్యను మించిన గోగణం, ఆశ్రమ పరిసరములందంతటా నిలిచింది శిష్యుని కార్యదీక్షకు, శ్రద్ధాభక్తులకు గౌతమ మహర్షి ఆనందాన్ని పొందాడు సత్యకాముడు గురుదేవునకు సాష్టాంగ నమస్కారం చేసి, వినయంగా నిలుచున్నాడు.

గురుదేవులైన హారిద్రుమత గౌతమ మహర్షి సత్యకాముని బ్రహ్మ వర్చస్సును జూచి సంతోషించాడు, ఆశ్చర్యపడ్డాడు గౌతమ మహర్షి సత్యకామునితో ''ప్రియదర్శనుడా! నీ ముఖం బ్రహ్మతేజస్సుతో ప్రకాశిస్తున్నది. నేను తత్త్వోపదేశంచేయకనే గోసేవలో నియోగించితిని కదా! నీకు ఎవరు బ్రహ్మ స్వరూపాన్ని ఉపదేశించారు?'' అని ప్రశ్నించాడు.

సత్యకాముడు నిశ్చల దృక్కులతో, నిర్మలమైన మనస్సుతో ''గురుదేవా! మీ ఆజ్ఞను పాలిస్తూ గోసేవావ్రతాన్ని చేస్తున్న నాయెడ వాయు, అగ్ని, ఆదిత్య, ప్రాణదేవతలు ప్రసన్నులై బ్రహ్మతత్త్వాన్ని ఉపదేశించారు. ఆ తత్త్వాన్ని ఉపాసించమని ఆదేశించారు నేను మీ వంటి తపస్సంపన్నుల వల్ల గురుముఖంగా ఉపదేశం పొందిన విద్యయే శ్రేష్ఠమైనది, ఫలప్రదమైనది అని తెలుసుకున్నాను కాబట్టి నాకు మీరు బ్రహ్మవిద్యోపదేశం చేయండి'' అని ప్రార్థించాడు

సత్యకాముని వినయ విధేయతలకు, సంతోషించి గౌతమ మహర్షి సత్యకామ జాబాలికి దేవతల ద్వారా ఉపదేశించబడిన షోడశకళా విశిష్టము, చతుష్పాదయుక్తము అయిన బ్రహ్మస్వరూపాన్ని సమగ్రంగా ఉపదేశించాడు ఆ బ్రహ్మతత్త్వాన్ని ఉపాసించి సత్యకాముడు బ్రహ్మ జ్ఞాని యైనాడు. బ్రహ్మవిద్యను ఆచార్యుని ద్వారా పొందగలిగితే సార వత్తరమై, పరిపూర్ణమై ఉంటుంది

సత్యకాముడు తన సత్యవ్రతనిష్ఠతో గుర్వాదేశరూపమైన గోసేవావ్రతాన్ని, తపోదీక్షతో ఆచరించి, దేవతానుగ్రహాన్ని పొంది, బ్రహ్మ స్వరూపాన్ని తెలిసికొన్నాడు గురుముఖంగా ఆబ్రహ్మవిద్యను సమగ్రంగా తెలిసికొని ఉపాసించి బ్రహ్మస్వరూపుడైనాడు జబాల పుత్రుడైన సత్యకాముడు చరితార్థుడైనాడు

**గురువుగా సత్యకామ జాబాలి :**

సత్యకాముడు గౌతమ మహర్షి అనుజ్ఞను పొంది, గృహస్థాశ్రమాన్ని స్వీకరించాడు. సరస్వతీ నదీతీరాన తన కొక ఆశ్రమాన్ని ఏర్పరచుకొన్నాడు. గురుకులాన్ని స్థాపించాడు కొద్ది సంవత్సరాలలో బ్రహ్మర్షిగా, ఉత్తమ ఆచార్యునిగా ప్రసిద్ధిని పొందాడు అన్ని గురుకులాలలో విద్యకు ప్రాముఖ్యం ఉంటుంది కాని సత్యకాముని గురుకులంలో విద్యతోపాటు విద్యార్థుల సత్ప్రవర్తనపై ఎక్కువ శ్రద్ధ ఉండేది. సదాచారము, సద్విచారము, సత్ప్రవర్తన, సహనము, సాధుసేవ

మొదలగు గుణములపై బ్రహ్మచారులకు తగిన శిక్షణ యివ్వబడుతుండేది అందు వల్ల దేశంలోని నలుమూలలనుండి విద్యార్థులు సత్యకామ జాబాలి ఆశ్రమానికి వస్తుండేవారు

**ఉపకోసలుని వృత్తాంతం :**

కమలుని కుమారుడు ఉపకోసలుడు - అధ్యయనం కోసం సత్యకాముని గురుకులంలో చేరాడు సత్యకాముడు అతనికి బ్రహ్మచర్య దీక్షనిచ్చి, అధ్యయనంతో పాటు అగ్ని సేవాకార్యక్రమంలో నియమించాడు ఉపకోసలుడు గుర్వాజ్ఞను శ్రద్ధగా అనుసరిస్తూ, స్వాధ్యాయ బ్రహ్మ చర్యమును నియమంతో పాటిస్తూ, అగ్ని హోత్రములకు విశేషంగా పరిచర్యచేస్తూ పండ్రెండు సంవత్సరాలు గడిపాడు

ఒకనాడు కొందరు బ్రహ్మచారులు- ఉపకోసలుని తర్వాత గురుకులంలో చేరినవారు - తమ అధ్యయనం పూర్తి చేసుకొని, సమావర్త నోత్సవం (బ్రహ్మచర్య దీక్ష పూర్తి అయినట్లు ధ్రువీకరించటం) జరుపుకొని గృహస్థాశ్రమ స్వీకారానికి యోగ్యులై గురుదేవుల ఆశీర్వాదమును, అనుమతిని పొంది, స్వగృహాలకు వెళ్ళిపోయారు సత్యకాముడు ఉపకోసలుని మాత్రం బ్రహ్మవిద్యాధికారిగా నిశ్చయించి, అందుకు ఇంకా కొంతకాలం తన అగ్నిహోత్రములకు పరిచర్య చేయించవలెనను అభిప్రాయంతో అతనికి సమావర్తనోత్సవం జరిపించలేదు అందుకు ఉపకోసలుడు చాల బాధ పడ్డాడు గురువు గారి మనస్సు అతనికి అర్థం కాలేదు

## ఎందుకీ ఉపవాసం?

గురుశుశ్రూషాతత్పరుడై, ఆచార్యుని అగ్నిహోత్రములకు శ్రద్ధా తపస్సులతో పరిచర్య చేస్తూ పండ్రెండు సంవత్సరాలు గడిపి, తత్సేవా సంతప్తుడై యున్న ఉపకోసలుని విషయమై సత్యకాముని ధర్మపత్ని భర్తతో ''స్వామీ! ఈ బ్రహ్మచారి (ఉపకోసలుడు) తపోవాసనియమాలను కఠినంగా, శ్రద్ధగా అనుసరిస్తున్నాడు. అగ్నిహోత్రములకు పరిచర్యలను సక్రమంగా నిర్వర్తిస్తున్నాడు. ఏనాడూ అతడు అగ్ని సేవలో పొరబడ లేదు. అగ్నిహోత్రములు కూడా తమకు శ్రద్ధగా సేవజేసిన బ్రహ్మచారిని అనుగ్రహింపవలెనని చెప్పినవి కావు. కనుక అతనికి విద్యోపదేశం చేసి, సమావర్తనోత్సవం జరిపించవలసింది'' అని చెప్పింది.

సత్యకాముడు భార్యమాటలను విని మౌనంగా వున్నాడు. సమాధానం చెప్పలేదు ఉపకోసలుని అగ్నిపరిచర్యయందు నియమించి, కార్యార్థియై మరొక ఆశ్రమానికి వెళ్ళాడు. ఉపకోసలుడు విశేషానుగ్రహము చేయదలచిన ఆచార్యుని అభిప్రాయమును తెలిసికోలేక మనోవ్యధ పొందాడు అయినా '' ప్రవాసంలో నున్న ఆచార్యుని ఆజ్ఞాను సారం అగ్నులకు పరిచర్య చేస్తే అది వ్యర్థం కాబోదు'' అని అనుకొని యథాప్రకారంగా అగ్నులకు పరిచర్యచేస్తూ, అగ్నిశాలలోనే ఉన్నాడు. హృదయంలో మాత్రం బాధ నానాటికి అధికమైంది చివరకు ఒకనాడు నిరాశతో నిరశనవ్రతాన్ని చేయదలంచి, భిక్షాచరణం చేయక

ఊరకున్నాడు అగ్నిశాలలో ఉపవాస వ్రతం చేస్తున్న ఉపకోసలుని చూచి గురుపత్ని చాల బాధపడింది మాతృభావంతో ఉపకోసలుని చూచి, ''వత్సా! ఎందుకోసం ఉపవాసం చేస్తున్నావు? ఉపవాసం మాని భోజనం చెయ్యి'' అంది

ఉపకోసలుడు ''అమ్మా! ఈ కృతార్థుడు కానివాని శరీరంలో అనేక చింతలు, సంకల్పాలు వ్యాధులవలె పీడిస్తున్నాయి వ్యాధిపీడితులు భోజనం చేయరు గదా! అందుచేత నేను వ్యాధినివారణకై భోజనం చేయడం లేదు అందుకు అనుమతించండి'' అని ప్రార్థించాడు గురుపత్ని ఆరోజుకు ఉపవాసవ్రతాన్ని అనుమతించి, వెళ్ళి పోయింది

## త్రేతాగ్నుల ఉపదేశం :

ఉపకోసలుడు ఉపవాసవ్రతంతో, గుర్వాజ్ఞను శిరసావహించి, నియమముతో అగ్నిపరిచర్య చేస్తుండగా త్రేతాగ్నులు సంతుష్టిని పొంది, '' ఈ బ్రహ్మచారి మనకు పండ్రెండు సంవత్సరాల నుండి శ్రద్ధా తపస్సులతో నియమనిష్ఠలతో సేవ చేస్తున్నాడు ఇతనిపై అనుగ్రహం చూపాలి'' అని తలంచి, శ్రద్ధాళువైన బ్రహ్మచారికి బ్రహ్మోపదేశం చేసి, కృతార్థుని చేయ నిశ్చయించినాయి

త్రేతాగ్నులు ఉపకోసలునికి ప్రత్యక్షమై ''వత్సా! ఉపకోసలా! నీ పరిచర్యకు సంతుష్టులమైనావము. నీకు బ్రహ్మవిద్యను ఉపదేశిస్తున్నాము'' అన్నాయి

ఉపకోసలుడు- ''చిత్తం! అగ్నిదేవతలారా! అనుగ్రహించండి! బ్రహ్మ విద్యను ఉపదేశించి, నన్ను కృతార్థుని చేయండి'' అని ప్రార్థించాడు

త్రేతాగ్నులు - ''ప్రాణం బ్రహ్మ, కం బ్రహ్మ, ఖం బ్రహ్మ'' (ప్రాణమ్ బ్రహ్మ. ఆనందమ్ బ్రహ్మ, ఆకాశమ్ బ్రహ్మ) అని ఉపదేశించాయి.

ఉపకోసలుడు - అగ్ని దేవతలారా! మీరు ఉపాస్య బ్రహ్మ స్వరూపమును మూడు విధములుగా బోధించారు వానిలో ప్రాణమ్ బ్రహ్మ అనే విషయం నాకు తెలుసు. ఎందుకంటే, ప్రాణం ఉన్నంతవరకే జీవనం ప్రాణం లేక పోతే మరణమే కాబట్టి ప్రాణాన్ని బ్రహ్మ అనటం సమంజసమే. కాని కం (ఆనందము), ఖం (ఆకాశము) బ్రహ్మతత్త్వమని మాత్రం నాకు తెలియదు. వివరించండి'' అని విన్నవించాడు

త్రేతాగ్నులు - ''కం అనేది ఖం, అట్లాగే ఖం అనేదే కం ఈ రెండూ ఒక్కటే కం అంటె ఆనందము ఖం అంటే ఆకాశము ఆనందమనేది ఆకాశరూపం అనటం వల్ల అది నిత్యము, వ్యాపకమని తెలుసుకో''

ఈ విధంగా త్రేతాగ్నులు ఉపకోసలునికి బ్రహ్మ స్వరూపమైన ప్రాణాన్ని, దానికి ఆశ్రయమైన హృదయాకాశాన్ని గురించి బోధించాయి. ఆనందం బ్రహ్మతత్త్వం యొక్క సహజస్వరూపమని తెలియజేశాయి. చివరకు ప్రాణము, ఆనందము, దహరాకాశము అంతయు బ్రహ్మమ్ అని బ్రహ్మ స్వరూపాన్ని ఉపదేశించాయి

తర్వాత ఆ బ్రహ్మవిద్యకు అంగభూతమైన అగ్నివిద్యను, ఉపాసించు విధానాలను త్రేతాగ్నులు ఉపకోసలునికి ఉపదేశించాయి పిమ్మట త్రేతాగ్నులలో మొదటిదైన గార్హపత్యాగ్ని ఉపకోసలునితో ''పృధివి, అగ్ని, అన్నము, ఆదిత్యుడు - ఇవి నాలుగు నా శరీరాలు ఆదిత్యునిలో కనిపించే పురుషుణ్ణి నేనే ఈ తత్త్వాన్ని తెలిసికొని ఉపాసించేవాని పాపకర్మలన్నీ నశిస్తాయి. అతడు చివరకు అగ్నిలోకాన్ని పొందుతాడు. అతనిని మేము ఈలోకంలోను, పరలోకంలోను కాపాడుతాము'' అని ఉపదేశించింది.

తర్వాత దక్షిణాగ్ని (అన్వాహార్య పచనాగ్ని) ''జలము, దిక్కులు, నక్షత్రాలు, చంద్రుడు- ఈ నాలుగు నా శరీరాలు చంద్రునిలో కనిపించే పురుషుణ్ణి నేనే ఈ విషయాన్ని తెలిసికొని ఉపాసించే వాని పాపాలన్నీ నశిస్తాయి. అతడు అగ్నిలోకాల్లో నివసిస్తాడు మేము అతనిని ఈ లోకంలో, పరలోకంలో కూడ కాపాడుతాము'' అని బోధించింది

తర్వాత బ్రహ్మచారియైన ఉపకోసలునికి ఆహవనీయాగ్ని ''ప్రాణం, ఆకాశం, ద్యులోకం, విద్యుత్తు'' - ఈ నాలుగు నాశరీరాలు విద్యుత్తులో కనిపించే పురుషుణ్ణి నేనే ఈ విషయాన్ని తెలుసుకొని ఉపాసించేవాడు- పాపాలను పోగొట్టుకోగలుగుతాడు విశుద్ధ జీవనుడు అవుతాడు పూర్ణాయుర్దాయాన్ని పొందుతాడు. అగ్నిలోకాలలో నివసిస్తాడు మేము అతనిని ఈ లోకంలోను, పరలోకంలోను కూడా కాపాడుతాము'' అని ఉపదేశించింది

తర్వాత మూడు అగ్నులు ఒక్కసారిగా

*"ఓ ప్రియదర్శనుడా! ఉపకోసలా! మేము నీకు, మాకు (అగ్నులకు) సంబంధించిన విద్యను, బ్రహ్మవిద్యను ఉపదేశించాము. దీని అనుష్ఠానక్రమాన్ని, ప్రయోజనాన్ని మీ గురువు నీకు ఉపదేశిస్తాడు."*

అని చెప్పి, అంతర్ధానమయ్యాయి ఉపకోసలుని హృదయం ఆనందంతో నిండిపోయింది. ముఖం దివ్యతేజస్సుతో ప్రకాశించింది ఉపకోసలుడు తన జీవితం ధన్యమైందని తలంచాడు ఇక గురుదేవుని రాకకు, వారి ద్వారా పొందవలసిన సమగ్ర బ్రహ్మవిద్యోపదేశానికి ఎదురుజూడసాగాడు.

**ఆచార్యుని రాక :**

తర్వాత కొన్నాళ్ళకు సత్యకామ జాబాలి తన ఆశ్రమం చేరాడు అగ్నిశాలలోనున్న ఉపకోసలునియందు బ్రహ్మవిద్యాప్రాప్తి సూచకములగు చిహ్నాలను చూచి సంతోషించాడు ఆశ్చర్యపడ్డాడు " ఓ సౌమ్యుడా! ఉపకోసలుడా! నీవు బ్రహ్మతేజస్సుతో ప్రకాశిస్తున్నావు. నీకు బ్రహ్మవిద్యను ఎవరు ఉపదేశించారు?" అని ప్రశ్నించాడు

ఉపకోసలుడు గురుదేవునికి నమస్కరించి వినయంగా "ఆచార్యా! మీరు కాక నాకు ఉపదేశం చేయుటకు అర్హులెవ్వరున్నారు?

మీ అంశములుగా నాచేత పరిచర్య చేయబడుచున్న ఈ అగ్నులు, నాయెడ ప్రసన్నమై, మీ పరోక్షంలో ఆచార్యస్వరూపులై బ్రహ్మవిద్యను ఉపదేశించాయి ఇక బ్రహ్మవిద్యాసాధనమును, ప్రయోజనమును మీరు అనుగ్రహించండి నన్ను కృతార్థుని చేయండి'' అని ప్రార్థించాడు

సత్యకాముడు - 'వత్సా! ఈ అగ్నులు ఏమని ఉపదేశించాయి'' అని అడిగాడు ఉపకోసలుడు తనకు అగ్నులు ఏ విధంగా బోధించినది, జరిగినదంతా చెప్పాడు. అది విని గురువర్యుడు శిష్యుని ఆదర పూర్వకంగా'' ఓ సాధువృత్తసంపన్నుడా! ఉపకోసలా! ఈ అగ్నులు నీకు బ్రహ్మవిద్యాసాధకముగా పృధివ్యాది లోకములను మాత్రమే ఉపదేశించాయి నేను నీకు సమగ్రమైన బ్రహ్మవిద్యాసాధనమును ఉపదేశిస్తాను. తామరాకుకు నీటిబొట్టు అంటని రీతిగా మనస్సును దుష్టభావ ప్రభావానికి లోనుకానీయకుండా బ్రహ్మానుభూతిని పొంది ఆనందించు'' అన్నాడు

ఉపకోసలుడు- ''గురుదేవా! తప్పకుండ ఆవిషయం నాకు ఉపదేశించండి'' అని ప్రార్థించాడు.

**ఆచార్యుని ఉపదేశము :**

''ఇంద్రియనిగ్రహము, సమాహిత చిత్తము కల్గిన వివేక వంతుడు తన నేత్రంలో ఉండే పురుషుణ్ణి చూడ గల్గుతాడు. అతడే ఆత్మ ఈ

ఆత్మ భయము లేనిది మరణము లేనిది అదే బ్రహ్మ ఆ పురుషునికి స్థానమైన నేత్రంలో నెయ్యిగాని, నీరుగాని పోస్తే, అది నేత్రానికి అంట కుండా తామరాకు మీద పడ్డ నీటిబొట్టులాగా అటూ ఇటూ కనురెప్పలలోనికి జారిపోతుంది ఇది ఆ పురుషుడు ఉండే స్థానానికి గల మాహాత్మ్యం. ఇక ఆ స్థానంలో ఉండే పురుషుని నిస్సంగత్వం (దేనిని అంటుకోని గుణం) యొక్క మహిమను ఏమని చెప్పగలం?

ఈ నేత్రస్థ పురుషునికి 'సంయద్వామ' అనే పేరు ఉంది ఈశబ్దానికి ఆకర్షణీయములైన అభ్యుదయములకు లక్ష్యమని, అపేక్షణీయములైన సమస్తశుభములు అన్నివైపుల నుండి వచ్చి ఇతనిని చేరుతాయి అని అర్థం ఈ విషయం తెలిసికొన్నవాడు 'వామని'. ఇతడే సమస్త పుణ్యకర్మల ఫలితాన్ని పొందుతాడు. ఈ తత్త్వాన్ని తెలిసి కొన్నవాడు 'భామని' ఇతడు ఆదిత్య, చంద్ర, అగ్ని స్వరూపాలలో భాసమానుడై ఉంటాడు కనుక 'భామని' సార్థక నామధేయం ఈ విధమంతా తెలిసిన వాడు కూడ అన్ని లోకాల్లో భాసమానుడౌతాడు. ఇతడే బ్రహ్మజ్ఞాని. బ్రహ్మ స్వరూపుడు కూడ

బ్రహ్మజ్ఞానికి అంత్యక్రియలు చేసినా, చేయకపోయినా అతడు తేజోమార్గాన్నే పొందుతాడు ఆదిత్యుని, చంద్రుని, విద్యుత్తును పొందుతాడు ఈ విద్యుల్లోకాన్ని చేరినట్టి ఉపాసకుణ్ణి బ్రహ్మలోకం నుండి దివ్యులు వచ్చి, సత్యలోకంలో ఉన్న బ్రహ్మవద్దకు తీసుకొనిపోతారు ఇదే దేవమార్గం ఇదే బ్రహ్మమార్గం ఈ మార్గంగుండా వెళ్ళిన ఉపాసకుడు

మళ్ళీ మానవలోకానికి రాడు హిరణ్యగర్భలోకం లేదా సత్యలోకంలోనే ఉంటాడు '' ఈ విధంగా బ్రహ్మర్షి సత్యకామ జాబాలి పరబ్రహ్మను చక్షురంతర్గత జ్యోతిర్మయ పురుషునిగా ఉపాసించమని తన శిష్యుడు ఉపకోసలునికి ఉపదేశించాడు

ఉపకోసలుడు తనకు అగ్నులచే బోధింపబడిన ఆనంద విశిష్ట దహరాకాశోపలక్షిత బ్రహ్మస్వరూపమును, ఆచార్య సత్యకామ జాబాలిచే నిర్దేశింపబడిన నేత్రస్థానోపలక్షిత, సంయద్వామ, వామనీ, భామనీ గుణవిశిష్టముగా ఉపాసన చేసి బ్రహ్మవేత్త అయినాడు ఆచార్యుని అనుగ్రహం సంపూర్ణంగా ఫలించింది।

బ్రహ్మర్షి సత్యకామ జాబాలి ఉపకోసలుని అభ్యుదయమునకు సంతోషించి, సమావర్తనోత్సవం జరిపి, గృహస్థాశ్రమ స్వీకారమునకు అనుజ్ఞ ఇచ్చాడు ఉపకోసలుడు తన జన్మ ధన్యమైనదని భావించి, ఆచార్య దంపతులకు సాష్టాంగ నమస్కారము చేసి, వారి ఆశీర్వాదములను పొంది, వారి అనుమతితో స్వగృహం చేరాడు.

శిష్యునిగా, గురువుగా సత్యకామ జాబాలి చరితార్థుడు ఆ బ్రహ్మర్షి జీవితం ఆదర్శప్రాయం ఆతని సత్యనిష్ఠ అందరికీ అనుసరణీయం

*ఓం శాంతిః శాంతిః శాంతిః*

❀ ❀ ❀

TIRUMALA TIRUPATI DEVASTHANAMS

CENTENARY CELEBRATIONS OF SRI VENKATESWARA VEDAPATHASALA

★ DHARMAGIRI ★

&

VEDA - AGAMA - SILPA SADAS

5-7-1999 To 8-7-1999